రాగము - నాదనామక్రియ - ఏకతాళము

తా. ఏ దేశమున నుండువారూ - మీరు
ఎందుండి యిట వచ్చినారూ?
రా. తొలుత గోదావరియందు - మా
స్థలము భద్రాచలమందూ

తా. ఎవరి జవానులు మీరూ - మి
మ్మెవరు పంపఁగ వచ్చినారు?
రా. దాస జవానులు మేమూ - రామ
దాసు పంపఁగ వచ్చినాము.

తా. ఏమి కులమువారు మీరూ - మీ
రిద్దరు నే వరుస వారూ?
రా. ఇనవంశమునఁ బుట్టినామూ - మే
మిద్దఱ మన్నదమ్ములము

తా. ఏమి నామము గలవారూ - మీ
రేమి నీమము గలవారు?
రా. రామోజి లక్ష్మోజి నామం - మేము
రామానుజమతమువారం

తా. ఎందుకు పంపించినారు - మీ
రేమి పనిగ వచ్చినారు?
రా. సర్కా రుబ్బాకీ పయికం - మా
చేతఁబంపఁగ వచ్చినాము.

తా. అర్థమంతయుఁ దెచ్చినారా - లేక
వ్యర్థముగా వచ్చినారా?
రా. వ్యర్థులము మేము కాము- మీ
యర్థ మంతయుఁ దెచ్చినాము.

తా. బైరోజీ బైరోజీ మీరు - మీ
బాటలు చూడఁగ వేరు
రా. బైరోవారముగాము మేము - మీ

భేటికి నిట వచ్చినాము.

తా. ధనము మాచేతికియ్యండీ - యా
వెనుక ఖైదులోకి పొండీ.

రా. ఖైదులోకి మేము పోమూ - మీ
ఖజాన పయిక మిచ్చేము

తా. చెల్లింతురా ద్రవ్యమంతా - ర
శీదుల నడుగుట వింతా!
ఉంగరంబు విడెమందూ - ను
ప్పొంగుచు దొర దట్టియందు॥
మొహరు జేసినంతలోన - జగ
న్మోహనాంగులు సంతోషమున.